

## వైద్యుడిపై దాడికి నిరసనగా 'నిర్మల్ బంద్' సక్సెస్

- స్వచ్ఛందంగా మద్దతు తెలిపిన వ్యాపార, వాణిజ్య సంఘాలు
- పట్టణంలో భారీ పోలీస్ బందోబస్తు
- ఏఎస్పీ సాయికిరణ్ పర్యవేక్షణ
- నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఐఎంఏ వైద్యులు
- బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ.. పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తత


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

ఆదివారం | 29 మార్చి 2026 | 12 పేజీలు


ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ రాజకీయ యవనికపై పెను మార్పులకు నాంది పలికి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బలమైన పునాది వేసిన చారిత్రాత్మక 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర ప్రారంభమై మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ బహిరంగ సభకు శ్రీకారం చుట్టింది. నాటి పాదయాత్ర స్ఫూర్తిని స్మరించుకుంటూ, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం సాధించిన 99 రోజుల ప్రగతిని ప్రజలకు వివరించేందుకు ఏప్రిల్ 6న బోథ్ నియోజకవర్గంలోని పిప్రి గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదిలాబాద్ జిల్లా నుంచే ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే గడ్డపై ప్రభుత్వం విజయ గాథను వినిపించనుంది. 'ప్రజాపాలన' ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పర్యటనలో, పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రధాన హామీల అమలు ప్రక్రియను సీఎం స్వయంగా ప్రారంభించనున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు అధికారిక పత్రాలను అందజేస్తూ, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చాటిచెప్పనున్నారు.

# పిప్రి గడ్డపై..
# ప్రజాపాలన జెండా!



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ విజయకేతనానికి నాంది పలికిన ఆదిలాబాద్ 'పీపుల్స్ మార్చ్' స్మృతులు..
- ఏప్రిల్ 6న బోథ్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ
- ఉదయం బాసర సరస్వతి అమ్మవారి దర్శనం
- మధ్యాహ్నం పిప్రిలో 'జనగర్జన' సభ
- 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రకు మూడేళ్లు
- హామీల అమలు పత్రాల పంపిణీకి సర్వం సిద్ధం
- ఉదయం బాసర అమ్మవారి దర్శనం
- మధ్యాహ్నం పిప్పిరిలో జనగర్జన
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి దిశానిర్దేశం

08




## స్త్రీనిధిలో నిర్మల్ జిల్లా టాప్



12

- మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా అధికార యంత్రాంగం..
- లోకేశ్వరం మండలానికి ప్రత్యేక పురస్కారం
- మహిళల ఆర్థిక సాధికారతకు నిదర్శనం

## సురక్షిత ప్రయాణమే శ్రేయస్కరం



12

- ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతా పాటించాలి..
- అవగాహన కార్యక్రమంలో డీసీపీ ఎగ్గిడి భాస్కర్

## ఆర్టీసీ సమస్యలపై ముఖాముఖి

ప్రభాత సమాచారం, నిర్మల్ ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా 'మహాలక్ష్మి' పథకం ద్వారా ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజైన శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల ప్రజాప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో కొత్త బస్సుల అవసరం, శిథిలావస్థలో ఉన్న బస్ స్టేషన్ల ఆధునీకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, కొత్త రూట్ల ఏర్పాటుపై ఎమ్మెల్యేలు మంత్రికి వినతి పత్రాలు సమర్పించారు. పాత బస్టాండ్ల స్థానంలో అత్యాధునిక సౌకర్యాలతోకొత్త భవనాల నిర్మాణం, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలని వినతి పత్రాలు సమర్పించారు.

- ప్రజాప్రతినిధుల వినతుల వెల్లువ
- ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం సమీక్ష
- కొత్త రూట్లు, బస్సులు, డిపోల ఏర్పాటుపై నియోజకవర్గాల వారీగా విజ్ఞప్తులు
- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- రవాణా శాఖ మంత్రి పొన్న హెచ్చరిక



10

## నిర్మల్ జిల్లాకు రెండు
## 'స్కోచ్' అవార్డుల పంట

- పొనికి వనం, 'అమ్మరక్షిత' కార్యక్రమాలకు గుర్తింపు..
- ఢిల్లీలో పురస్కారాలు అందుకున్న కలెక్టర్ అభిలాష
- జిల్లా ఖ్యాతిని చాటిన కొయ్యబొమ్మల పరిరక్షణ, మాతృత్వ మరణాల నివారణ చర్యలు..

12



నిర్మల్ జిల్లా పేరు జాతీయ స్థాయిలో మరోసారి మారుమోగింది. జిల్లా యంత్రాంగం అమలు చేసిన వినూత్న పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు గుర్తింపుగా రెండు ప్రతిష్టాత్మక 'స్కోచ్' అవార్డులు వరించాయి. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా శనివారం జరిగిన కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఈ పురస్కారాలను అందుకున్నారు.

## రూ.25.80 కోట్లతో లక్షెట్టిపేట

# మున్సిపల్ బడ్జెట్ అంచనాలు ఖరారు








- అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి
- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య
- లక్షెట్టిపేటలో బడ్జెట్ సమావేశానికి హాజరు..
- సమన్వయంతో పనిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు అదనపు కలెక్టర్ పిలుపు..
- డంప్ యార్డ్‌లో బయో మైనింగ్ పనుల పరిశీలన
- పారిశుధ్యం మెరుగు చర్యలు తీసుకోవాలి..

**లక్షెట్టిపేట, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, చైర్ పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్ రాజేశ్వరి లతో కలిసి బడ్జెట్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధికి బడ్జెట్ ప్రణాళికలు సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని తెలిపారు. వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించి, 2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026-27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ లను కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో ప్రతిపాదిత మున్సిపల్ బడ్జెట్‌ను ఖరారు చేశారు. 2026-27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ 25 కోట్ల 80 లక్షల రూపాయల అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో 3 కోట్ల 42 లక్షల రూపాయలు సాధారణ ఆదాయం (గ్రాంట్లు కాకుండా), 21 కోట్ల 42 లక్షల రూపాయల గ్రాంట్లు, 90 లక్షల రూపాయల డిపాజిట్లు, అడ్వాన్సులు, 5 లక్షల 95 వేల రూపాయల నిలువ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని డంప్ యార్డ్‌లో చేపడుతున్న బయో మైనింగ్ పనులను పరిశీలించారు. పాత చెత్తను శాస్త్రీయ పద్ధతులలో వేరు చేసి, పర్యావరణానికి హాని లేకుండా నిర్వహిస్తున్న విధానం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బయో మైనింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం చేయండి



- నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశం
- రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి
- ఎండల దృష్ట్యా కేంద్రాల వద్దనీరు, టెంట్లు తప్పనిసరి
- గడువులోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం..

**నిర్మల్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

యాసంగి వరి ధాన్యం కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో యాసంగి (రబీ) వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నిర్ణీత సమయానికి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి, గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సంబంధించి తగిన ఏర్పాట్లను తక్షణమే పూర్తిచేయాలని పేర్కొన్నారు. ధాన్యాన్ని అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద టెంటు, త్రాగునీరు, తదితర వసతులు కల్పించాలని వివరించారు. ఎక్కడ కూడా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తగినన్ని ధాన్యపు సంచులు, తూకపు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సరఫరాల శాఖ అధికారి రాజేందర్, పౌరసరఫరాల మేనేజరు సుధాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్‌లో జిల్లా స్థాయి

# క్రీడా పాఠశాల ఎంపికలు

- మినీ స్టేడియంలో విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన
- 60 మంది క్రీడాకారుల హాజరు
- యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంచడమే లక్ష్యం
- డీవైఎస్‌ఓ శ్రీకాంత్ రెడ్డి, క్రీడా ప్రతినిధులు

**నిర్మల్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు స్థానిక ఎన్.టీ.ఆర్ మినీ స్టేడియంలో శనివారం నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుండి సుమారు 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా ప్రతిభను గుర్తించి, ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీ.వై.ఎస్.ఓ శ్రీకాంత్ రెడ్డి, ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, పీడీ రమణారావ్, పీఈటీ భోజన్న, పీడీలు లక్ష్మణ్, సత్తయ్య, ఎం. సత్యనారాయణ, కె. శ్రీనివాస్, ఆర్. వెన్నెల, శారదా, సంజు రాథోడ్, కవిత, వంశీధర్, నచ్చేందర్, దేవేందర్ పాల్గొన్నారు.



# మంచిర్యాల జిల్లాలో అసెంబ్లీ నగారా




- 3 నుంచి 5కు పెరగనున్న స్థానాలు?
- జిల్లా రాజకీయాల్లో పెను మార్పులు..

**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై కేంద్రం అడుగులు వేస్తుండటంతో, మంచిర్యాల జిల్లాలో రాజకీయ వేడి మొదలైంది. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 3 అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య (మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్) పెరిగే అవకాశం ఉండటంతో, జిల్లా భౌగోళిక స్వరూపం పూర్తిగా మారిపోనుంది. జనాభా ప్రాతిపదికన కొత్త నియోజకవర్గాలు ఏర్పడితే, పరిపాలనలో విప్లవాత్మక మార్పులు వస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

మంచిర్యాల జిల్లాలో సాధ్యమయ్యే మార్పులు

**మంచిర్యాల నియోజకవర్గం విభజన..**

జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణం వేగంగా విస్తరిస్తోంది. జనాభా పరిమితి దాటిపోతుండటంతో, మంచిర్యాల నియోజకవర్గాన్ని రెండుగా విభజించే అవకాశం ఉంది. మంచిర్యాల టౌన్ కేవలం పట్టణ ప్రాంతానికే పరిమితం కావచ్చు. లక్సెట్టిపేట,హాజీపూర్ వీటిని కలిపి కొత్తగా ఒక సెపరేట్ నియోజకవర్గంగా మార్చే ప్రతిపాదనలు వచ్చే అవకాశం ఉంది. పారిశ్రామిక ప్రాంతాల విలీనం మందమర్రి - రామకృష్ణాపూర్ ప్రస్తుతం మందమర్రి మండలం చెన్నూర్ పరిధిలో ఉండగా, రామకృష్ణాపూర్ ప్రాంతం మంచిర్యాల పరిధిలో ఉంది. డీలిమిటేషన్‌లో ఈ సింగరేణి బెల్ట్ మొత్తాన్ని కలిపి ఒకే నియోజకవర్గంగా లేదా కొత్త సమీకరణాలతో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీనివల్ల కార్మిక ఓటర్ల ప్రభావం ఒకే చోట కేంద్రీకృతమవుతుంది.

**బెల్లంపల్లి, చెన్నూర్ రిజర్వేషన్ల మార్పు?...**

ప్రస్తుతం బెల్లంపల్లి మరియు చెన్నూర్ నియోజకవర్గాలు ఎస్సీ (రాజ) రిజర్వుడ్ స్థానాలుగా ఉన్నాయి. నియోజకవర్గాల సంఖ్య పెరిగినప్పుడు, జనాభా లెక్కల ప్రకారం రోస్టర్ పద్ధతిలో రిజర్వేషన్లు మారవచ్చు. ఏదైనా ఒక స్థానం జనరల్ కేటగిరీలోకి వచ్చే అవకాశం ఉంటే, అది జిల్లా రాజకీయాల్లో పెను సంచలనమే అవుతుంది.

**జిల్లాపై పడే ప్రభావం..**

నియోజకవర్గం పరిధి తగ్గడం వల్ల ఎమ్మెల్యేలకు ప్రతి గ్రామంపై పట్టు ఉంటుంది. నిధుల కేటాయింపు కూడా తలసరి ప్రాతిపదికన పెరిగి, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి. నియోజకవర్గాల సంఖ్య పెరిగితే, ఇప్పటివరకు ద్వితీయ శ్రేణిలో ఉన్న నేతలకు శాసనసభకు వెళ్లే మార్గం సుగమం అవుతుంది. రాజకీయ నిరుద్యోగం తగ్గి, కొత్త ముఖాలు తెరపైకి వస్తాయి. పరిపాలన సౌలభ్యం జిల్లాలో మరిన్ని రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుకు ఈ ప్రక్రియ దోహదపడుతుంది.

**సవాళ్లు - ఉత్కంఠ...**

పునర్విభజన జరిగితే తమ పట్టున్న గ్రామాలు ఏ నియోజకవర్గంలోకి వెళ్తాయోనని ప్రస్తుత ఎమ్మెల్యేలలో ఆందోళన నెలకొంది. సరిహద్దుల మార్పు వల్ల పాత సమీకరణాలు పనిచేయవు, కాబట్టి నాయకులు ఇప్పటి నుంచే కొత్త గ్రామాల్లో పర్యటనలు పెంచే అవకాశం ఉంది. మంచిర్యాల జిల్లాలో 2026 నాటికి ఈ ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. సీట్ల సంఖ్య పెరగడం వల్ల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మరింత రాజకీయ ప్రాధాన్యత లభిస్తుంది.

# ఈదురు గాలుల ప్రభావం.. నేలకూలిన భారీ వృక్షాలు



**బజార్‌హత్నూర్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
సోనాల–ఇచ్చోడ ఆర్‌డబీ ప్రధాన రహదారి పై ఇటీవల వీచిన తీవ్ర ఈదురు గాలుల కారణంగా పలు భారీ వృక్షాలు నేలకూలి రహదారి పై పడిపోయాయి. ఈ మార్గం గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లే ప్రజలు ప్రయాణం సాగిస్తుండగా, పడిపోయిన చెట్లు రాకపోకలకు తీవ్రమైన ఆటంకంగా మారాయి. రోడ్డు మధ్యలోనే వృక్షాలు పడిపోవడంతో వాహనదారులు వంకర్లు తిరుగుతూ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు పణంగా పెట్టుకుని ప్రయాణం కొనసాగిస్తున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. వెలుతురు లేకపోవడం, చెట్ల పొదలు స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనాలు నేరుగా వాటిలోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే కొన్ని ప్రమాదాలు సంభవించినట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు పలుమార్లు సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ప్రమాదాలు జరుగుతున్నా కూడా అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి వాహనాలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబీ అధికారులు స్పందించి, రహదారి పై పడిపోయిన వృక్షాలను వెంటనే తొలగించి, ప్రయాణికులకు భద్రత కల్పించాలని ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## శ్రీరామ పట్టాభిషేకం వేడుకలు

**తాండూర్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని బోయపల్లి హనుమాన్ దేవాలయం, మాదారం టౌన్ షిప్‌లోని కోదండ రామాలయంతో పాటు పలు ఆలయాలలో శనివారం శ్రీరామ పట్టాభిషేకం వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోయపల్లిలో పూజారి జగదీష్, మాదారం కోదండరామాలయంలో ఆలయ అర్చకుడు, వేదపండితులు ముద్దు అవధూత శర్మ, వివిధ ఆలయాలలో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. తాండూర్ గ్రామంలో హనుమాన్ స్వాములు వివిధ ఆలయాల వరకు భజనలు చేస్తూ నగర సంకీర్తన చేపట్టారు. మాదారంలో హనుమాన్ స్వాములు ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా స్టీల్ గాసులు వాడి వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు పద్మ విజయభాస్కర్ రెడ్డి, బెల్లంపల్లి ఓసీపీ ప్రాజెక్టు ఆఫీసర్ ఉమాకాంత్ కృష్ణకుమారి దంపతులు, సుబ్రమణ్యం దంపతులు, మాసాడి శ్రీదేవి శ్రీరాములు దంపతులు, తిరుపతి అంజలి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

### డాక్టర్‌పై దాడి చేసిన వారిపై

## చర్యలు తీసుకోవాలి

**ఆదిలాబాద్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడిపై దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదిలాబాద్ ప్రధాన కార్యదర్శి కళ్యెం వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లతో డాక్టర్లు నిరసన తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైద్యులకు తగిన భద్రత కల్పించాలన్నారు. ఇందులో కాలేష్ సతీష్, రంజిత్ జాధవ్, రామ అశోక్, శ్యామల సత్యనారాయణ, తిరుమల రెడ్డి, కల్యాణ్ చక్రవర్తి, ఆనంద్, చిన్మయ్ తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ సంబంధమే యువకుడి హత్యకు కారణమా

**ఆదిలాబాద్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పట్టణంలో తెల్లవారుజామున ఓ యువకుడు హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉండే మహమ్మద్ అర్బాజ్ (25)ను ముగ్గురు వ్యక్తులు తెల్లవారుజామున తరుముతూ కర్రలతో దాడి చేయగా, అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ సునీల్ కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అక్రమ సంబంధమే ఈ హత్యకు దారితీసి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## అవగాహనతోనే క్షయ వ్యాధి నిర్మూలన



**మంచిర్యాల, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
అవగాహనతోనే క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఇవంజాలిన అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని తాళ్ల గురజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిజిఆర్ ఎస్‌జెసి పాఠశాల, కళాశాలలో నిర్వహించిన టిబి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులలో ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందన్నారు. ఇందుకోసం పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం వలన క్షయ వ్యాధిని అరికట్టవచ్చు అన్నారు. ఈ వ్యాధి తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. మద్యం, పొగాకు తీసుకునే వారికి వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులతో క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సత్తయ్య, స్టాఫ్ నర్స్ సంగీత, డివిజన్ క్షయ వ్యాధి సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్, క్షయ వ్యాధి విజిటర్ గంగబోయిన.వెంకటేశం, సూపర్వైజర్ మల్లికా, ఏఎన్ఎంలు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



### మొక్కజొన్న, జొన్న కొనుగోలు

## కేంద్రం ఏర్పాటు చేయాలి

### అఖిలపక్ష నాయకుల వినతి

**బజార్‌హత్నూర్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలో మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోలుకు ప్రత్యేక సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ.. అఖిలపక్ష నాయకులు, రైతులు సోమవారం ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో పి.ఐ.సి ఇంచార్జ్ సంతోష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. రైతులు తమ పంటలను అమ్ముకునేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల సమయం, రవాణా ఖర్చులు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. స్థానికంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకార సంఘ సీఈఓ నారాయణగౌడ్, అఖిలపక్ష నాయకులు, రైతులు,కొత్త శంకర్, లక్కం శంకర్, చట్ల సుకుదేవ్, సూది నంది నర్సయ్య, కీర్తి చంద్రశేఖర్, చట్ల రమేష్,పాల్గొన్నారు. బాల గోవింద్, సుభాష్ తదితరులు హాజరయ్యారు. దీంతో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని పి.ఐ.సి ఇంచార్జ్ సంతోష్ హామీ ఇచ్చారు.

## తైబజార్ వేలం పాట

**బెల్లంపల్లి, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
2026–27 సంవత్సరానికి గాను శనివారం మునిసిపల్ కార్యాలయంలో తైబజార్ వేలం పాట నిర్వహించారు. పసుల వెంకటస్వామి రూ. 13,50,000 ఎక్కువ పాట పాడి కూరగాయల సంతను దక్కించుకున్నారు. వేలం పాటలో నలుగురు పాల్గొన్నారు. ఇందులో వెంకటస్వామి ఎక్కువ పాడి సంతను వశం చేసుకున్నారు. తైబజారు వేలం పాట నిర్వహించినట్టు మునిసిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి తెలిపారు. నూతన తైబజారు కాలపరిమితి ఏడాది కాలం ఉంటుందని తెలిపారు.



### స్కిల్ డెవలప్మెంట్‌లో ట్రైనింగ్ పొందిన

# మహిళా అభ్యర్థులకు సర్టిఫికెట్స్ పంపిణీ

**మందమర్రి, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ అండర్ మందమర్రి ఏరియా, రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం నాడు మందమరి జీఎం ఎన్.రాధాకృష్ణ, ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు వాణి రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 31 మంది మహిళా అభ్యర్థులకు కాస్మోటాలజీ కోర్సును పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి సర్టిఫికెట్లను అందచేశారు. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఈరోజు కాస్మోటాలజి కోర్సును పూర్తి చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,సింగరేణి సంస్థ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి సూచనల మేరకు స్థానికంగా ఉండే



నిరుద్యోగ యువతకు లబ్ధి చేకూర్చే దిశగా సింగరేణి కాలరీస్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా ఒక సామాజిక బాధ్యతగాకార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉందన్నారు.

**తోటి వారి ఎదుగుదలకు సహకరించాలి..**

కావున స్థానికంగా ఉండేటువంటి నిరుద్యోగ యువత ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. శ్రీవాణి రాధాకృష్ణ మాట్లాడుతూ, ఈ కోర్సును ఉపయోగించుకొని ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని, తద్వారా ఆర్థికంగా ఎదగడానికి మార్గన్వేషణ చేయాలన్నారు. మందమరి ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వృత్తి విద్యా కోర్సులను నేర్చుకొని, ఆర్థికంగా ఎదగాలని మనతో పాటు మన తోటి వారి ఎదుగుదలకు సహకరించాలన్నారు. 31 మంది అభ్యర్థులకు సరిఫికేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సి.ఎం.ఓ.ఏ.ఐ అధ్యక్షులు రమేష్, అడిషనల్ మేనేజర్ టి.శ్రీధర్, అశోక్ కుమార్ అసిస్టెంట్ ట్రైనింగ్ మేనేజర్, కాస్మోటాలజీ ట్రైనర్ ప్రీతి తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అటవీ భూమి ఆక్రమణ

## మంటలు పెట్టి విలువైన సంపద నష్టం

**ఇచ్చోడ, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

ఇచ్చోడ రేంజ్ పరిధిలో అటవీ భూమి ఆక్రమణతో పాటు మంటలు పెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలంలోని చిన్మయతండకు చెందిన రాబడే కర్తార్ సింగ్ హర్కాయి రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని దిగ్నూర్ శివారులో అటవీ భూమిని అక్రమంగా ఆక్రమించి సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో మంటలు పెట్టడంతో అటవీ శాఖ ఆధ్వర్యంలో పెంచిన ప్లాంటేషన్‌లో మంటలు వ్యాపించి విలువైన అటవీ సంపద కాలిపోయింది. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు వెంటనే స్పందించి.. నిందితుడిని అదుపులోకి తీసుకుని అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా నిందితుడికి 13 రోజుల రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాలలో అక్రమంగా చొరబడి మంటలు పెట్టి అటవీ సంపదకు నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి శిక్షలు విధించబడతాయని స్పష్టం చేశారు.

## డాక్టర్‌పై దాడి చేసిన వారిని

# వెంటనే అరెస్టు చేయాలి

**సారంగాపూర్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలో సీనియర్ వైద్యులు డాక్టర్ సంతోష్ రాజుపై దాడి జరిగిన ఘటనపై సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. బిల్లు విషయంలో వైద్యుడిపై దాడి చేయడం హేయమైన చర్య అని, ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమించే వైద్యులపై దాడులను అరికట్టాలని, దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.



# వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలి

**నిర్మల్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

జగిత్యాల జిల్లా చెందిన యూట్యూబ్ వైష్ణవి హత్య చేసిన నిందితులను శిక్షించి మా కుటుంబానికి న్యాయం చేయాలని సామాజిక పరివర్తన అధ్యక్షురాలు నిర్మల అన్నారు. శనివారం ఆ కుటుంబాన్ని జగిత్యాలలో పరామర్శించి కుటుంబ సభ్యులకు జరిగిన అన్యాయంపై విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పరివర్తన మహిళా సంఘం సభ్యులు వనమాల ఉన్నారు.



# మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

## వైద్య శిబిరంలో మేయర్ మధుకర్

**మంచిర్యాల, మార్చి 28 (ప్రభాత సమాచారం)**



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని మేయర్ ధర్ని మధుకర్ అ న్నారు. నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజా పాలన ప్రగతి ప్ర ణాళికలో భాగంగా శనివారం స్పెషలిస్టు వైద్యులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆ రోగ్య కేంద్రం అందిస్తున్న వైద్య సేవలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రంలో పని చేసే వైద్య బృందం సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు వైద్యసేవలు అందించాలని సూ చించారు. కార్పొరేటర్ల ద్వారా ఆరోగ్య కార్యకర్తలచే ప్రజలకు అవగా హన కల్పించాలన్నారు. జిల్లా వైద్యాధికారి అనిత మాట్లాడుతూ ఇప్పటి వరకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య నిపుణు లచే శిబిరాలను నిర్వహించి పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఉచితంగా 72 రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి చికిత్స అందించి మం దులు పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వ్యాధులు ప్రబ లకుండా ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపా రు. ఈ వైద్య శిబిరంలో డిప్యూటి మేయర్ సల్ల రమ్య, కార్పొరేటర్లు రాచకొండ గోపాల్‌రావు, ఎండీ ఖలీద్, సుదమల్ల హరిక్రిష్ణ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సంచాలకులు డాక్టర్ వేద వ్యాస్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ వెంకటేశ్, సిహెచ్‌ఓలు కాకిరాల వెంకటేశ్వర్లు, ప్రశాంతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఆరోగ్య సిబ్బంది వెంకటేశ్, సునిల్, ఆయుశ్ వైద్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**కాగజ్‌నగర్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ పట్టణంలోని మోసం గ్రామ శివారులో ఉన్న బండల ఒర్రెలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 50 ఏళ్ల వయస్సు గల ఈ వ్యక్తి రెండు రోజుల క్రితం మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు ఎరుపు రంగు టీషర్ట్, ఆష్ కలర్ షార్ట్ ధరించి ఉండగా, మెడలో నలుపు దారం, చేతికి కడియం, ఎరుపు, పసుపు దారాలు ఉన్నాయి. సంబంధిత వివరాలు తెలిసిన వారు సమీప పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**చింతలమానేపల్లి, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

మండలంలోని దిందా గ్రామ పంచాయతీలోని కేతిని గ్రామంలో గ్రామంలో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ నిర్మల భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను నివారించేందుకు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్, కాంట్రాక్టర్ సుధాకర్, రాజ్‌గొండ్ సభ్యులు బొంద్యాలు, జమ్మయ్య, రమేష్, చంద్రయ్య, రామన్న, మధుకర్, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు. పెంచికలపేట మండలంలోని కొండపల్లి గ్రామ పంచాయతీలోని ఆరెవాడలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సహకారంతో శనివారం సీసీ రోడ్డుకు సర్పంచ్ రుక్మాబాయి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు భీమేష్, నాయకులు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు. వాంకిడి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈ జీఎస్ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ చిన్ను శనివారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా సకాలంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, నాగభూషణం, దాదాజీ, శ్రీనివాస్, సోము పాల్గొన్నారు.

# సీనియర్ ఎస్జీటీలకు అన్యాయం జరిగితే సహించం




**కడెం, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లతో పాటు సీనియర్ ఎస్‌జీటీలకు కూడా జనాభా గణన విధులు కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. శనివారం కడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో చాలామంది సీనియర్ ఉపాధ్యాయులకు మాత్రమే ఎన్యుమరేటర్ విధులు కేటాయించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, ఎస్‌జీటీలలో కూడా సీనియర్ ఉపాధ్యాయులు ఉన్నారని వారు పేర్కొన్నారు. ఎస్‌జీటీలకు సమాన ప్రాధాన్యత ఇవ్వకపోతే భవిష్యత్తులో అన్ని సంఘాలతో కలిసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్థిక ప్రయోజనం చేకూరే అంశాల్లో ఎస్‌జీటీలను దూరంగా పెట్టడం సరైంది కాదని, ఈ విషయంలో అన్ని సంఘాలు ఒకే విధంగా ఆలోచించాలని అన్నారు. సభ్యత్వం కోసం మాత్రమే ఎస్‌జీటీలను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. భవిష్యత్తులో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఐక్యంగా కార్యాచరణ రూపొందించి తమ సంఘాన్ని బలోపేతం చేసే దిశగా పోరాటం ప్రారంభిస్తామని తెలిపారు.



## రైస్ మిల్ నిర్మాణానికి

# అనుమతులు ఇవ్వద్దు

**దిలావర్‌పూర్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

దిలావర్‌పూర్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న రైస్ మిల్లుకు గ్రామపంచాయతీ నుండి ఎలాంటి అనుమతులు ఇవ్వద్దని ఎంపీఓ, ఈఓకు శనివారం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ కళాశాల, ఇండ్లు, దేవాలయాలు ఉన్నందున నిర్మాణం జరగకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరేష్ కుమార్, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 30న రాష్ట్ర వ్యాప్తంగా

# నిరసన కార్యక్రమాలు

**నిర్మల్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోర్టు చట్టాలనురద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా నిరసన నిర్వహిస్తున్నట్టు ఐఎఫ్టి జిల్లా కార్యదర్శి రాజన్న తెలిపారు. శనివారం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా కార్మికులందరూ ఈ నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రమేష్ నాగరాజు తదితరులు ఉన్నారు.



# రోడ్డు భద్రతపై అవగాహన

**వాంకిడి, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

వాంకిడి మండల కేంద్రంలో ఎస్ఐ మహేంద్రర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్లు దాటేటప్పుడు సిగ్నల్స్ పాటించాలని, అతివేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, కుటుంబానికి తీరని లోటు కలుగుతుందని ఆయన తెలిపారు. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## బాలికల ఆత్మవిశ్వాసానికి
# ‘ఆత్మరక్షణ శిక్షణ’ ఒక వేదిక

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- ఆపద సమయంలో ధైర్యంగా తలపడేలా విద్యార్థినులకు ప్రత్యేక తర్ఫీదు..
- జిల్లాలోని 130కి పైగా పాఠశాలల్లో మూడు నెలల పాటు విజయవంతంగా శిక్షణ
- పి.ఎం. శ్రీ పాఠశాలల్లో 72 సెషన్ల పాటు నిపుణులతో విద్యార్థులకు ప్రత్యేక మెళకువలు



**ఆదిలాబాద్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులు ఆపద సమయాల్లో ధైర్యంగా తలపడేలా, వారి రక్షణకు వారే పూనుకునేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన ‘ఆత్మరక్షణ శిక్షణ’ కార్యక్రమం విజయవంతంగా పూర్తికావడం పట్ల శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఎదురయ్యే అవాంఛనీయ సంఘటనలను ఎదుర్కోవడానికి బాలికలకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం అత్యవసరమని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 130కి పైగా జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్, ఆశ్రమ పాఠశాలల్లో సుమారు మూడు నెలల పాటు ఈ శిక్షణను సమర్థవంతంగా నిర్వహించామని ఆయన తెలిపారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ పి.ఎం. శ్రీ పథకం కింద ఎంపికైన 24 పాఠశాలల్లో అత్యధికంగా 72 సెషన్ల పాటు, ఇతర ఉన్నత పాఠశాలల్లో 33 సెషన్ల పాటు నిపుణులైన శిక్షకుల ద్వారా మెళకువలను నేర్పించినట్లు వివరించారు. విద్యార్థినులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ‘ధైర్యే సాహసే లక్ష్మి’ అన్న నినాదంతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ శిక్షణ ద్వారా బాలికలు ఆకస్మిక దాడుల నుండి తమను తాము కాపాడుకోవడమే కాకుండా, పరిసరాల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండే అవగాహనను పొందారని ఆయన అన్నారు. విద్యార్థినుల నుంచి వచ్చిన విశేష స్పందనను చూస్తుంటే, భవిష్యత్తులో వారు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే శక్తిని సాధించారని నమ్మకం కలుగుతోందని, బాలికల సాధికారతకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం దోహదపడతాయని కలెక్టర్ ఈ ప్రకటనలో స్పష్టం చేశారు.

---

## షెడ్యూల్డ్ కులాల యువత నుండి
# దరఖాస్తుల గడువు పొడిగింపు

**మందమర్రి, మార్చి 28 (ప్రభాత సమాచారం)**




2025-26 సంవత్సరానికి గాను షెడ్యూల్ కలముల కార్యకరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ఆమోదిత మొదటి విడత పథకాల కోసం అర్హత గల ఎస్.సి. యువత దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈ.ఈ. చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా రంగం ఎలక్ట్రికల్ లో ఈ.వి. ద్విచక్ర వాహన లక్ష్యం 185 యూనిట్లకు గాను 608 దరఖాస్తులు, ఈవి త్రిచక్ర వాహనం (సరకు/ప్రయాణికుల రవాణా) లక్ష్యం 91 యూనిట్లకు గాను 838 దరఖాస్తులు, వ్యవసాయ పథకాలలో సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగం లక్ష్యం 19 యూనిట్లకు గాను 73 దరఖాస్తులు ఆన్ లైన్‌లో https://tgobmms.cgg.gov.in నమోదు కావడం జరిగిందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల షెడ్యూల్డ్ కులములకు చెందిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

---

# సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తతో వ్యవహరించాలి

- మాయమాటలు నమ్మి మోసపోవద్దు..
- సైబర్ నేరాలపై పోరాడుతున్న పోలీసు వ్యవస్థ
- వారం జిల్లాలో 14 సైబర్ క్రైమ్ ఫిర్యాదుల నమోదు
- సైబర్ క్రైమ్‌లో గోల్డెన్ హవర్ ముఖ్యమైనది
- మోసపోయిన వెంటనే 1930 కి సంప్రదించాలి..
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

భారతదేశంలో సైబర్ నేరాలు ఎన్నో రకాలుగా ఉన్నాయని వాటిని అధిగమించాలంటే ప్రజలు ప్రతి ఒక్కరికి సైబర్ నేరాల పట్ల అవగాహన తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తతో వ్యవహరించాలని శనివారం పోలీసు ముఖ్య కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ వివరాలను తెలియ జేశారు. ప్రస్తుతం ఆన్లైన్ ఆధారిత బ్యాంకు లావాదేవీలు కొనసాగుతున్న ఆధునిక భారతదేశంలో సైబర్ నేరాలు ఏపీకే ఫైల్స్, జాబ్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, ఈ కామర్స్ ఫ్రాడ్, కస్టమర్ కేర్ ఫ్రాడ్, స్టాక్ మార్కెటింగ్ ఫ్రాడ్ అంటూ ఎన్నో రకాలుగా ఉన్నట్లు తెలిపారు. వీటన్నింటి పట్ల ప్రజలు మోసపోయే అవకాశం ఉన్నందున ఒకవేళ ఇలాంటి వాటివి మీ జీవితంలో ఎదురైతే వాటిని నమ్మవద్దని తెలిపారు. ఒకవేళ ఎలాంటి సందర్భంలోనైనా మోసపోయినట్లయితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు లేదా 1930 కు సంప్రదించి సహాయం పొందవచ్చని తెలిపారు. సైబర్ క్రైమ్ జరిగిన ఘటనలో గోల్డెన్ హవర్ ముఖ్యమైనదని మోసపోయిన గ్రహించిన వెంటనే గంటలోపు ఫిర్యాదు చేసిన ఎడల ఆర్థిక నేరాలలో ఎక్కువ శాతం డబ్బులు తిరిగి వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతీ యువకులను బురిడీ కొట్టించే సైబర్ని రకాలు వర్క్ ఫ్రం హోం అంటూ మోసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆన్లైన్ ఆధారిత సోషల్ మీడియా నందు ఈ కామర్స్ పేరుతో దుస్తులు నగలు వివిధ అంశాలలో ఎక్కువ శాతం ప్రజలకు, కొనుగోలు చేసిన వారికి నిరాశే ఎదురవుతుందని వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో లోన్ ఆప్ ద్వారా లోన్ తీసుకునే వారికి సైబర్ క్రైమ్ నేరగాళ్లు మోసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉన్న డబ్బులు సైతం తస్కరించుకుపోతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా నందు ఎదురైన పలు సంఘటనలు పై వివరణ అందజేశారు. ఇంస్టాగ్రామ్ నందు 500 కే లాప్టాప్ అంటూ మిగిలిన డబ్బులు ఇంటికి వచ్చిన తర్వాత ఇవ్వాలి అంటూ నకిలీ బిల్లులు చూపిస్తూ బాధితుని వద్దనుండి 2000 రూపాయలను మోసం చేశారు సైబర్ నేరగాళ్లు. ఇన్స్టాగ్రామ్ నందు విలువైన బహుమతులు అందజేస్తామని ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాధితుని వద్ద నుండి విడుదలవారీగా 60 వేల రూపాయలను సైబర్ నేరగాళ్లు తస్కరించారు. తిరిగి వారికి ఎలాంటి బహుమతులు అందజేయలేదు. తెలియని అప్లికేషన్లను ఫోన్లో ఇన్స్టాల్ చేసుకోవడం వల్ల వారి ఫోన్ డేటా సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లి తిరిగి బెదిరించే అవకాశాలు, సందర్భాలు ఎదురయ్యాయి అని తెలిపారు.

---

**ఆదిలాబాద్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

# 105 మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత




మొబైల్ ఫోన్ లేనిదే ఎలాంటి పని జరగని ఈ అధినాతన సమాజంలో మనకు అత్యంత విలువైనది, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే సాంకేతిక పరికరం మొబైల్ ఫోన్. మొబైల్ ఫోన్లో అన్ని వివరాలు, అన్ని జ్ఞాపకాలు, అన్ని లావాదేవీలకు సంబంధించిన అప్లికేషన్లు ఉంటాయి, సాధారణంగా ప్రజలు మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడం, దొంగలించబడటం జరుగుతుంది. పోగొట్టుకున్న వాటిని పొందాలంటే, బాధితులు వెంటనే https://www.ceir.gov. in అనే వెబ్సైట్‌లో లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా నందు ఇలా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి సంపాదించడం కోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా రికవరీ బృందాన్ని ఏర్పాటు చేశారని, ఇలా జిల్లా ఎస్పీ ఆదేశాలతో వీరు గత 30 రోజుల వ్యవధిలో దాదాపు వివిధ రాష్ట్రాల నుండి జిల్లాల నుండి బాధితులు పోగొట్టుకున్నటువంటి, దొంగలించబడినటువంటి 105 మొబైల్ ఫోన్ లను తిరిగి రాబట్టడం జరిగింది. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుండి ఇప్పటివరకు ఒక సంవత్సర కాలంలో 1100 మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టడం జరిగింది. ఇలా ఇంత మొత్తంలో రాబట్టడం జిల్లా చరిత్రలోనే ప్రథమం, మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు దాదాపు మధ్యతరగతి కుటుంబీకులు, బీదవారు వారు ఎంతగానో కష్టపడి కొనుక్కున్న మొబైల్ ఫోన్ను తిరిగి వారికి అందజేయాలని సదుద్దేశంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఈ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా మొబైల్ ఫోన్ దొంగతనాలు జరిగే ప్రాంతాలు రైతు బజార్, రిమ్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇళ్లలో దొంగతనాలు, బంధువులకు ఫోన్ చేస్తానంటూ ఫోన్ తస్కరించడం లాంటివి జరుగుతున్నాయని వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మొబైల్ ఫోన్లను తిరిగి ఇచ్చే క్రమంలో శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశం మందిరంలో ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న, చోరీకి గురైనటువంటి బాధితులకు 105 మొబైల్ ఫోన్లు (దాదాపు 15.8 లక్షల విలువ చేసే ) వివిధ ప్రాంతాల నుండి తెప్పించి బాధితులకు తిరిగి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి అందుకున్న బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ, జిల్లా ఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రతి నెల రోజుల లో పోగొట్టుకున్నటువంటి మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టి బాధితులకు అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. బాధితులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే దగ్గర్లో ఉన్న సంబంధిత పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని తెలిపారు. మొబైల్ ఫోన్ దుకాణాల యజమానులు, రిపేరింగ్ దుకాణాల యజమానులు, మొబైల్ ఫోను కొనే ముందు మొబైల్ ఫోన్ యజమాని అనుమతి సరైన పత్రాలు తీసుకోవాలి, దొంగ మొబైల్ ఫోన్లు కొన్న ఎడల వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ముఖ్యంగా రాబట్టిన మొబైల్ ఫోన్లు ఉత్తర భారతదేశంలో ఉండటం వాటిని ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో తిరిగి రాబట్టడం జరిగిందని తెలిపారు. మొబైల్ దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేయడం జరిగిందని. దొంగలించిన పడిన మొబైల్ ఫోన్ల కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ డి.ఎస్.పి ఎల్ జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ప్రత్యేక బృందం సభ్యులు ఆర్ఎస్ఐ పి గోపి కృష్ణ, ఎం ఎ రియాస్, మజీద్, త్రిశూల్, అన్వేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గనుల్లో టీబీజీకేఎస్ ఉద్యమం

- మెడికల్ బోర్డులు నిర్వహించాలని డిమాండ్
- నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన
- వినతి పత్రాలు సమర్పించిన నాయకులు



**మందమర్రి, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను నిరసి స్తూ, మెడికల్ బోర్డులు నిర్వహించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాల ని డిమాండ్ చేస్తూ టీబీజీకేఎస్ దశల వారీ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు శనివారం సింగరేణి వ్యాప్తంగా గనులు, విభాగాలపై కార్మికులతో కలసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపింది. మందమర్రి ఏరియాలోని కేకే ఐదు, కేకేఓసీ, వర్క్‌షాప్, సివిల్ తదితర విభాగాలపై అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర ఉపాధ్యక్షుడు రవీందర్, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఓరుగోండ రాజశేఖర్ మాట్లాడుతూ గతేడాది జూలై, నవంబర్ మాసాల్లో నిర్వహించిన మెడికల్ బోర్డుల్లో అర్హత కలిగి, అన్‌ఫిట్ చేయని కార్మికుల కోసం తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, అందులో భాగంగా నెలకు మూడు మె డికల్ బోర్డులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇక శ్రీరాంపూర్‌లోని 7 గను లు, రెండు ఓసీపీలు, డిపార్ట్‌మెంటులపై టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు బండిరమేశ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కాసిపేట 1 ఇంక్లైన్ గని, కాసిపేట 2 ఇంక్లైన్ గనులపై టీబీజీకేఎస్ ఆ ధ్వర్యంలో నిరసన చేపట్టారు. నెలకు 3 మెడికల్ బోర్డులు 100 శాతం అమలు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రామకృష్ణాపూర్‌లోని ఏరియా హా స్పిటల్, సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పిట్ కార్యదర్శి దబ్బెటి సంతోశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. జేఈ విజయ కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించి అర్హులైన వారికి ఉద్యోగాలు కల్పించాలని టీబీజీకెఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ డివిజన్‌లో ఇందాఖని 1ఏ గనిపై టీబీజీకేఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గనిమేనేజర్‌కు



అందించారు. బెల్లంపల్లి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్‌లలో సింగరేణి ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలని, డిస్మిస్డ్ కార్మికులను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### డాక్టర్‌పై దాడి కేసులో
## నలుగురు నిందితులు అరెస్ట్

**నిర్మల్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఆర్ పిల్లల హాస్పిటల్‌లో డాక్టర్, సిబ్బందిపై భౌతిక దాడికి పాల్పడిన నలుగురు నిందితులను పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్సూరెన్స్ కోసం అధిక మొత్తంలో బిల్లు ఇవ్వాలని డిమాండ్ చేయగా, డాక్టర్ నిరాకరించడంతో పథకం ప్రకారం దాడి చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. మహమ్మద్ సల్మాన్ హుస్సేన్, మహమ్మద్ షౌకత్, షాబాద్ అలీ, మహమ్మద్ ఆజాద్ హుస్సేన్‌లను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

## సోలార్ దీపాల ఏర్పాటు

**వేమనపల్లి, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
వేమనపల్లి ఎస్సీ కాలనీలో రూ. 2 లక్షల సీఎస్ఆర్ నిధులతో సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేయనున్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్, మాజీ జడ్పీటీసీ సంతోష్ కుమార్ సహకారంతో ఈ పనులు చేపడుతున్నారు. శనివారం సర్పంచ్ ఉప్పులపు సాయికృష్ణ, వార్డు సభ్యులు, నాయకులు కలిసి పనుల కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సోలార్ లైట్ల ఏర్పాటుతో కాలనీలో చీకటి సమస్య తీరనుంది. ఈ పనులు 2026 మార్చి 28న ప్రారంభమయ్యాయి.



# బెల్లంపల్లిలో జాతీయ లోక్ అదాలత్

### రికార్డు స్థాయిలో 740 కేసుల పరిష్కారం




**బెల్లంపల్లి, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
న్యాయ వివాదాలను సామరస్యపూర్వక వాతావరణంలో, ఖర్చు లేకుండా త్వరితగతిన పరిష్కరించుకోవడమే లక్ష్యంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ బెల్లంపల్లి పట్టణంలో అత్యంత విజయవంతమైంది. శనివారం స్థానిక కోర్టు సముదాయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రికార్డు స్థాయిలో మొత్తం 740 కేసులు ఉభయ పక్షాల అంగీకారంతో పరిష్కరించబడ్డాయి. గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి వీ. ముఖేష్ గారు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించి, కక్షిదారుల మధ్య సయోధ్య కుదిర్చారు. న్యాయమూర్తి వీ. ముఖేష్ గారి చొరవ: రాజీ మార్గమే రాజమార్గం ఉదయం కోర్టు ప్రారంభమైనప్పటి నుంచే కక్షిదారులతో కోర్టు ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా గౌరవ జడ్జి వీ. ముఖేష్ గారు మాట్లాడుతూ, లోక్ అదాలత్ అనేది సామాన్య ప్రజలకు న్యాయవ్యవస్థ అందించిన ఒక గొప్ప వరమని పేర్కొన్నారు. కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరగడం వల్ల సమయం, ధనం వృథా అవుతాయని, రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల ఇరు వర్గాలకు మనశ్శాంతి లభిస్తుందని ఆయన వివరించారు. ముఖ్యంగా లోక్ అదాలత్‌లో వెలువడే తీర్పుపై తిరిగి అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని, ఇది తుది తీర్పుగా పరిగణించబడుతుందని ఆయన స్పష్టం చేశారు. బార్ అసోసియేషన్ మరియు న్యాయవాదుల కీలక పాత్ర ఈ లోక్ అదాలత్ విజయవంతం కావడంలో బెల్లంపల్లి బార్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు స్థానిక న్యాయవాదులు కీలక పాత్ర పోషించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అంకేం శివకుమార్ గారు నేతృత్వంలో న్యాయవాదుల బృందం కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రాముఖ్యతను వివరించారు. అంకేం శివకుమార్ గారు మాట్లాడుతూ, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని తగ్గించడమే కాకుండా, కక్షిదారుల మధ్య ఉన్న శత్రుత్వాన్ని పోగొట్టి వారిని మళ్లీ కలిపేందుకు న్యాయవాదులు తమ వంతు కృషి చేశారని తెలిపారు. పరిష్కరించబడిన కేసుల వివరాలు నేడు జరిగిన అదాలత్‌లో వివిధ విభాగాలకు చెందిన 740 కేసులు ఒకే రోజు కొలిక్కి వచ్చాయి. అందులో ప్రధానంగా సివిల్ వివాదాలు: భూ తగాదాలు, ఆస్తి పంపకాలు మరియు అద్దె వివాదాలు క్రిమినల్ కేసులు: రాజీ పడదగ్గ చిన్న తరహా క్రిమినల్ కేసులు మోటారు వాహన ప్రమాదాలు బాధితులకు త్వరితగతిన ఇన్సూరెన్స్ పరిహారం అందేలా చర్యలు. కుటుంబ తగాదాలు భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తొలగించి, వారిని మళ్లీ కలిపిన సందర్భాలు. చెక్ బౌన్స్ కేసులు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పెండింగ్ వివాదాలు. కక్షిదారుల హర్షం సుదీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ విసిగిపోయిన అనేకమంది కక్షిదారులు, నేడు తమ కేసులు పరిష్కారం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఎటువంటి ఖర్చు లేకుండా, ఇరు పక్షాలు గౌరవప్రదంగా సమస్యల నుండి బయటపడటం లోక్ అదాలత్ గొప్పదనమని వారు కొనియాడారు. పాల్గొన్నవారు: ఈ కార్యక్రమంలో జడ్జి వీ. ముఖేష్ గారు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అంకేం శివకుమార్ గారితో పాటు సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు. బెల్లంపల్లి కోర్టు చరిత్రలో ఒకే రోజు 740 కేసులు పరిష్కారం కావడం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## శిక్షణ పూర్తి చేసిన వార్డు సభ్యులకు సర్టిఫికెట్ల పంపిణీ



**ముథోల్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
గ్రామపంచాయతీలలో వార్డుల అభివృద్ధికి వార్డు సభ్యులు కీలక పాత్ర పోషిస్తారని జిల్లా పంచాయతీ అధికారిగా (డీఎల్‌పీఓ) లక్ష్మణ్ అన్నారు. బాసర రైతు వేదికలో పది గ్రామపంచాయతీలకు చెందిన నూతనంగా ఎన్నికైన 90 మంది వార్డు సభ్యులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారం విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి డీఎల్‌పీఓ లక్ష్మణ్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారని తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టం, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు, గ్రామాభివృద్ధి, గ్రామ సభల నిర్వహణ, పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాల నిర్వహణ, నిధుల వినియోగం వంటి అంశాలపై వార్డు సభ్యులు శిక్షణను సద్వినియోగం చేసుకున్నారని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వార్డు సభ్యులకు అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంపీఓ గంగా సింగ్, ఈఓ ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మణచందా సంత వేలం పాట

**లక్ష్మణచందా, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో 2026-2027 సంవత్సరంకు గాను అంగడి వారసంత వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో 90 వేల రూపాయలకు విక్రమ్ సింగ్ రాథోడ్ వరసంతను తీసుకున్నారు. అనంతరం జిపి ఆధ్వర్యంలో విక్రమ్ సింగ్ రాథోడ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓస కవిత రాజు, ఎంపీఓ నసీరుద్దీన్ ఉప సర్పంచ్ లక్కల వర్ష రవి పంచాయతీ కార్యదర్శి సుధాకర్. వార్డు సభ్యులు శ్రీనివాస్ ,అరటి రాజేశ్వర్ ,గుడ్ల సంధ్య రంజిత్ తదితరులు పాల్గొన్నారు.





# వైద్యుడిపై దాడికి నిరసనగా 'నిర్మల్ బంద్' సక్సెస్





- స్వచ్ఛందంగా మద్దతు తెలిపిన వ్యాపారులు..
- పట్టణంలో భారీ పోలీస్ బందోబస్తు
- ఏఎస్పీ సాయికిరణ్ పర్యవేక్షణ
- పట్టణంలో వజ్రా వాహనంతో పహారా...
- నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఐఎంఏ వైద్యులు
- విద్యాసంస్థలు, సినిమా థియేటర్ల మూసివేత
- బీజేపీ ఆధ్వర్యంలో పట్టనంలో భారీ బైక్ ర్యాలీ
- పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు..



**నిర్మల్, మార్చి 28 (ప్రభాత సమాచారం):** నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఆర్ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సంతోష్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ పిలుపునిచ్చిన 'నిర్మల్ బంద్' శనివారం విజయవంతమైంది. వైద్యుడిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపిస్తూ నిర్వహించిన ఈ బంద్‌కు పట్టణంలోని పలు సంఘాలు, ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు పలికారు.

**స్తంభించిన వాణిజ్యం – భారీ బైక్ ర్యాలీ...**

ఉదయం నుండే బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, మంచిర్యాల చౌరస్తా, ఈద్గాం వంటి ప్రధాన కూడళ్ల గుండా ర్యాలీ సాగింది. కిరాణా అసోసియేషన్ ప్రతినిధులు నారాయణరెడ్డి మార్కెట్ ప్రాంతంలో కాలినడకన తిరుగుతూ వ్యాపారులను బంద్‌కు సహకరించాలని కోరారు. మెజారిటీ వ్యాపారులు ముందస్తుగానే సర్క్యులర్లు జారీ చేయడంతో దుకాణాలన్నీ మూతపడ్డాయి. సినిమా థియేటర్లు, ప్రైవేటు విద్యాసంస్థలు సైతం బంద్ పాటించాయి. రవాణా పరంగా బస్సులు నడిచినప్పటికీ, ప్రయాణికుల రద్దీ తక్కువగా కనిపించింది.

**నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన...**

వైద్యుడిపై దాడిని ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఉదయం గంట పాటు వైద్య సేవలను నిలిపివేసి, నల్ల బ్యాడ్జీలు ధరించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అత్యవసర సేవల దృష్ట్యా ఆ తర్వాత యధావిధిగా విధులకు హాజరయ్యారు. ఆస్పత్రుల యాజమాన్యాలు సైతం బంద్‌కు సంఘీభావం తెలపడం గమనార్హం.

**పాత బస్టాండ్ వద్ద ఉద్రిక్తత...**

బంద్ కొనసాగుతున్న సమయంలో పాత బస్టాండ్ ప్రాంతంలో ఒక వర్గానికి చెందిన కొందరు వ్యాపారులు దుకాణాలు మూసివేయడానికి నిరాకరించారు. అక్కడికి చేరుకున్న బీజేపీ కార్యకర్తలు బంద్ చేయాలని పట్టుబట్టడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వెంటనే స్పందించిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

**పోలీసుల నిఘా.. వజ్రా వాహనంతో పహారా...**

బంద్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఏఎస్పీ సాయికిరణ్ స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో 'వజ్రా' వాహనంతో పెట్రోలింగ్ నిర్వహించారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ఎక్కడా ఘర్షణలు చోటు చేసు కోలేదు. సాయంత్రం తర్వాత పట్టణంలో వ్యాపార కార్యకలాపాలు మెల్లగా సాధారణ స్థితికి చేరుకున్నాయి.

# బ్యాంకు పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మృత్యువు కౌగిలిలోకి





- కడెం మండలంలో ఘోర ప్రమాదం
- లారీని ఢీకొన్న బైక్.. ఇద్దరు దుర్మరణం
- మృతులు గుర్రం మధిర గ్రామానికి చెందిన కుమరం భీమ్‌రావు, రంభబాయిగా గుర్తింపు..
- రాంపూర్-ఉడుంపూర్ గ్రామాల్లో విషాదం
- ఎరువుల లోడుతో వెళ్తున్న లారీ కిందకు దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

**కడెం, మార్చి 28 (ప్రభాత సమాచారం):** నిర్మల్ జిల్లా కడెం మండలంలో శనివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని ఉడుంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల రాంపూర్ – ఉడుంపూర్ గ్రామాల మధ్య లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడెం మండలం అల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గుర్రం మధిర గ్రామానికి చెందిన ఉయికే కుమరం భీమ్‌రావు (25), కొమరం రంభబాయి (45) పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మండల కేంద్రమైన కడెంకు వచ్చారు. బ్యాంకు పనులు ముగించుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అదే సమయంలో ఉడుంపూర్ గ్రామానికి చెందిన ఒక లారీ పశువుల ఎరువు (పెంటపెండ) లోడుతో బిర్సాయిపేట్ సమీపం నుండి నిర్మల్ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో బైక్ వేగంగా వచ్చి లారీని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బైక్ లారీ ముందు టైర్ కిందకు చొచ్చుకుపోవడంతో, దానిపై ప్రయాణిస్తున్న భీమ్‌రావు, రంభబాయి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న కడెం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.



## ఆదివాసీల ఆశలపై అటవీ ఆంక్షలు

### ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్

**ఉట్నూర్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
మండలంలోని కెటిఆర్ జోన్ పరిధిలో గ్రామాల్లో ప్రభుత్వాలు మంజూరు చేసిన ఇండ్ల నిర్మాణా లను ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని, ఈ ఇండ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ చౌహాన్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని దొంగచింత, కుమ్మరి కుంట, కోలాంగుడా గ్రామాలను సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినప్పటికీ గ్రామాలు కేటీఆర్ జోన్‌లో ఉన్నాయని ఫారెస్ట్ అధికారులు నిర్మాణాలు చేయొద్దని ఆదేశాలు జారీ చేసినట్లు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి కొలం ప్రజల కు ప్రభుత్వాలు ఇండ్లను మంజూరు చేయడం బాగానే ఉన్నా, కేటీఆర్ జోన్ ఇండ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం సరైంది. కాదన్నారు. గ్రామం ఏర్పడింది ఇప్పుడు కాదని, దశాబ్దాల కాలంగా అడవిని, పోడు వ్యవసాయన్ని సమ్ముకొని జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇండ్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి నిర్మాణాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. లేని పక్షంలో గిరిజన తిరుగుబాటు ఉంటుందని హెచ్చరిం చారు. ఆయన వెంట కోలాం సంఘం రాష్ట్ర నాయకులు టేకం వసంతరావు, ఆత్రం ముకుందరావు, కొడప రాజు, మడవి రమేష్, టెకం రాజు పటేల్ పలువురు ఉన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారం

**చెన్నూర్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా చెన్నూర్ మున్సిఫ్ కోర్టులో ఇవ్వాళ జాతీయలోక్ అదాలత్‌ను ర్వహించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి పర్వతపురవి జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా మొత్తం కేసు లు 281 కాగా అందులో డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు 185 అమౌంట్ 2,68,400/, బ్యాంక్‌లు, 23 అమౌంట్ 1829010/- పరిస్కారమయ్యాయి. 70 క్రిమినల్ కేసులు 3 సివిల్ కేసులు రాజీ పడ్డాయి. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## వన్యప్రాణులకు ప్రత్యేక నీటి వసతి ఏర్పాటు

**సిర్పూర్ (టి), మార్చి 28 (ప్రభాత సమాచారం)**
సిర్పూర్ (టి) రేంజ్ పరిధిలోని రిజర్వు ఫారెస్టు అయిన ఇటిక్యా ల పహాడ్ గ్రామ పరిసరాలు చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గ్రామం నుంచి వెయ్యి ఎకరాల విస్తీర్ణం గల ఎడారి భూముల్లో గత 2019-20 సంవత్సర కాలం నుంచి ప్రతి సంవత్సరం అటవీ శాఖ అధికారులు కొన్ని కోట్ల నిధులతో మొక్క పెంపకం అనే లక్ష్యంతో ప్రతి వర్షకాలం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో నాటిన మొక్కలు నేడు పెద్ద పెద్ద వృక్షాలు ఎదిగి దట్టమైన అటవీ ప్రాంతాలుగా మారాయి. దీంతో పాటు ఈ అటవీకి ఆనుకొని ఉన్న మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి పులులతో పాటు వన్యప్రాణులు సైతం వస్తుంటాయి. వీటి రక్షణ, దాహార్తి కోసం సోలార్ బోర్‌లు, నీటి కుంటలను సైతం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే పులుల ఆవాసం కోసం ప్రత్యేక బేక్ క్యాంపులకు రక్షణ కవచంలా నిర్మాణం చేపట్టి వాటిని ఎలాంటి హాని కలగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఇటు చెట్లు ఏపుగా పెరిగి మరో వైపు వన్యప్రాణి రక్షణ సులువుగా జరుగుతున్నది. ఏదీ ఏమైనప్పటికీ సిర్పూర్(టి) రేంజ్ అధికారులు పట్టువదలకుండా ఇటిక్యాలపహాడ్ గ్రామాన్ని రానున్న రోజుల్లో పర్యాటక కేంద్రంగా మార్చేలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారు. దీనితో తోటు ప్రతి రెండు మూడు నెలలకోసారి ఈ అటవీ ప్రాంతానికి రాష్ట్రా, జిల్లా స్థాయి అధికారులు సందర్శించి మరింత అభివృద్ధి అయ్యేలా సిబ్బందికి సూచనలు సలహాలు ఇస్తున్నారు. దీంతో గ్రామం ఒక అటవీ వనంలా అభివృద్ధి చెందుతుంది.



■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

**తెలంగాణ రాజకీయ యవనికపై పెను మార్పులకు నాంది పలికి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బలమైన పునాది వేసిన చారిత్రాత్మక 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర ప్రారంభమై మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ బహిరంగ సభకు శ్రీకారం చుట్టింది. నాటి పాదయాత్ర స్ఫూర్తిని స్మరించుకుంటూ, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం సాధించిన 99 రోజుల ప్రగతిని ప్రజలకు వివరించేందుకు ఏప్రిల్ 6న బోథ్ నియోజకవర్గంలోని పిప్రి గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు.** డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదిలాబాద్ జిల్లా నుంచే ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే గడ్డపై ప్రభుత్వం విజయ గాథను వినిపించనుంది.

# పిప్రి గడ్డపై..

'ప్రజాపాలన' ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పర్యటనలో, పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రధాన హామీల అమలు ప్రక్రియను సీఎం స్వయంగా ప్రారంభించనున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు అధికారిక పత్రాలను అందజేస్తూ, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చాటిచెప్పనున్నారు.


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

# ప్రజాపాలన జెండా!

- తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ విజయకేతనానికి నాంది పలికిన ఆదిలాబాద్ 'పీపుల్స్ మార్చ్' స్మృతులు..
- ఏప్రిల్ 6న బోథ్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ
- ఉదయం బాసర సరస్వతి అమ్మవారి దర్శనం
- మధ్యాహ్నం పిప్రిలో 'జనగర్జన' సభ
- 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రకు మూడేళ్లు
- హామీల అమలు పత్రాల పంపిణీకి సర్వం సిద్ధం
- ఉదయం బాసర అమ్మవారి దర్శనం
- మధ్యాహ్నం పిప్పిరిలో జనగర్జన
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి దిశానిర్దేశం






ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల 'ప్రజాపాలన' ఉత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బలమైన పునాది వేసిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకుంది. అయితే ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పిప్రి గ్రామంలో ఏప్రిల్ 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో రాష్ట్ర ఉన్నత అధికారులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లతో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. "ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం తాను సీఎల్పీ నేత హోదాలో చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర పిప్రి గ్రామం నుంచే ప్రారంభమైందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. అందుకే ఈ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా, పాదయాత్ర సమయంలో కొన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీల అమలు పత్రాలను అందజేస్తామని స్పష్టం చేశారు.

**సీఎం టూర్ ఇలా..!**

ఏప్రిల్ 6న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి బాసరకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొని, మధ్యాహ్నం 2 గంటలకు పిప్రి గ్రామానికి చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. " రాష్ట్రంలో '99 రోజుల ప్రజాపాలన ఉత్సవాలు' సమర్ధవంతంగా సాగుతున్నాయని, ఇందులో భాగంగానే గ్రామసభల నిర్వహణతో పాటు, ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభను పిప్పిరిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

**పీపుల్స్ మార్చ్ వేదికగా పలు సమస్యలకు పరిష్కారం..?**

గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను, గత బిఆర్ఎస్ ప్రభుత్వం 'ధరణి' పోర్టల్ ద్వారా ప్రొహిబిషన్ (నిషేధిత) జాబితాలో చేర్చిందని, దీనివల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర సందర్భంగా తన దృష్టికి తీసుకువచ్చారని ఆయన గుర్తుచేశారు. ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాటి సీఎల్పీ నేతగా తాను కలిసి.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులను వేధిస్తున్న ధరణిని రద్దు చేసి, పారదర్శకమైన వ్యవస్థను తెస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆ మాట ప్రకారమే అధికారంలోకి రాగానే 'భూభారతి' చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వం అసైన్డ్ భూములను 'పార్ట్-బి'లో పెట్టి రైతులకు హక్కులు లేకుండా చేసిందని, కానీ తమ ప్రభుత్వం చట్టబద్ధంగా వారి హక్కులను కాపాడుతుందని స్పష్టం చేస్తూ, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. 2004లో జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆడ వద్ద కొమరం భీమ్ ప్రాజెక్టు పనులు ప్రారంభమైనప్పటికీ, గత పది ఏళ్లుగా కాలువల నిర్మాణం పూర్తికాకపోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, కుడి మరియు ఎడమ కాలువలను వెంటనే పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఆలయ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాం..**

అలాగే చిక్ మాన్, పులిమడుగు, కుప్టీ త్రివేణి సంగమం ప్రాజెక్టులకు సంబంధించిన ప్రస్తుత స్థితిగతులపై వివరాలు ఆరా తీశారు. గిరిజనుల అభ్యున్నతి కోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా సాగును ప్రోత్సహించాలని సూచించారు. గిరిజన మహిళలు స్వయం ఉపాధిలో రాణించేలా వారికి వడ్డీ లేని రుణాలు అందిస్తూ తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గతంలో పాదయాత్ర సందర్భంగా కేస్లాపూర్‌లోని నాగోబా దేవాలయాన్ని సందర్శించినప్పుడు, మెస్రం వంశీయులు తమ సమస్యలను వివరించి ఆలయ అభివృద్ధిని కోరిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆలయ అభివృద్ధి కోసం నిధులు కేటాయించామని తెలిపారు. ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని స్పష్టం చేశారు. అదే విధంగా, ఈ ఏడాది జూన్ 2 నుండి ప్రారంభించబోయే నూతన పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అయితే పాదయాత్రలో చాలామంది పేదలు ఇళ్ల కోసం విన్నవించుకున్నారని గుర్తు చేశారు. ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో మంజూరు చేసిన ఇళ్ల సంఖ్య కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చినా వాటిని స్వీకరించాలని, అర్హులందరికీ ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఇలా గతంలో ఇచ్చిన అనేక హామీలకు సీఎం పర్యటన సందర్భంగా పరిష్కారం లభించే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ఇదిలా ఉంటే...**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారులు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు, శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రజా పాలన 99 రోజుల ఉత్సవాలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆనాటి సీఎల్పీ నేత ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిప్పిరి గ్రామం నుంచి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 6న నిర్వహించే ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి హాజరవుతున్న బహిరంగ సభకు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చట్టబద్ధంగా ఉన్న వాటిని పరిష్కరించాలని, సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా వారికి మంజూరు పత్రాలను అందించే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, వెడమ బొజ్జు, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఎడ్యుకేషన్ సెక్రెటరీ యోగితారాణా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆసిఫాబాద్ కొమరం భీం జిల్లా కలెక్టర్ హరిత, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిప్యూటీ సీఎం సెక్రెటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# యాక్షన్ మోడ్‌లో నాగశౌర్య

ఈ ఏప్రిల్‌లో 'బ్యాడ్ బాయ్ కార్తిక్'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు నాగశౌర్య. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని రామ్ దేశిన తెరకెక్కించారు. శ్రీనివాసరావు చింతలపూడి నిర్మాత. విధి కథానాయిక. సముద్రఖని, నరేశ్, సాయికుమార్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాని వచ్చే నెల 17న విడుదల చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకున్నారు. శౌర్య అందులో చేతిలో ఆయుధం పట్టుకుని సీరియస్ లుక్‌లో ఆసక్తికరంగా కనిపించారు. "అందర్నీ అలరించే కథతో పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని ముస్తాబు చేశాం. ఇప్పటికే ఈ చిత్ర థియేట్రికల్, నాన్ థియేట్రికల్ హక్కుల్ని జీస్టూడియోస్ భారీ ధరకు సొంతం చేసుకుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: హారిష్ జైరాజ్, ఛాయాగ్రహణం: రసూల్ ఎల్లోర్.





# మరోసారి 'విక్టరీ' కాంబో

మరొకసారి మరిచిపోలేని అనుభవాన్ని పంచే సంక్రాంతి అందిస్తామంటున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి, ఆయన బృందం. కుటుంబ కథలకు పెట్టింది పేరైన ఆయన ఈ ఏడాది సంక్రాంతికి శంకరవరప్రసాద్‌గారు'తో ఘన విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. మరొకసారి సంక్రాంతిని లక్ష్యంగా చేసుకుని కొత్త పట్టాలెక్కిస్తున్నారు. అది మల్టీస్టారర్ చిత్రంగా, వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కథానాయకులుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. జీ స్టూడియోస్ సహనిర్మాణంలో సురేష్ సమర్పిస్తోంది. వెంకటేశ్ - అనిల్ రావిపూడి కలిసి చేస్తున్న ఐదో చిత్రమిది. కథానాయకుడిగా నటించిన 'పటాస్'తోనే అనిల్ రావిపూడి దర్శకుడిగా పరిచయం అయ్యారు. షైన్ స్క్రీన్స్, అనిల్ రావిపూడి కలిసి చేస్తున్న మూడో ఎప్పట్నుంచో అనుబంధం ఉన్న వ్యక్తులు కలిసి చేస్తున్న సినిమా ఇది. "స్వచ్ఛమైన మరొకసారి అన్ని వయసుల ప్రేక్షకుల్నీ అలరించే వినోదంతో అనిల్ రావిపూడి రూపొందుతుంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. త్వరలోనే పూజా కార్యక్రమాలతో సినిమాని ప్రారంభిస్తాం. ఆ తర్వాత సినిమా వివరాల్ని వెల్లడిస్తామ'ని సినీ వర్గాలు తెలిపాయి. ఇందులో వెంకటేశ్ సరసన కల్యాణ్‌రామ్ సరసన కృతిశెట్టి నటించనున్నట్టు సమాచారం.

# హైప్ వద్దు.. టాలెంట్ ముద్దు

టాలీవుడ్ అందాల నటి రాశీ ఖన్నా ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండటమే కాకుండా, తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెబుతూ నిత్యం వార్తల్లో నిలుస్తోంది. ఇటీవల 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంతో మెరిసిన ఈ భామ, అటు టాలీవుడ్‌లో ఇటు బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈక్రమంలో.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ భామ సినీ ఇండస్ట్రీలో పీఆర్ టీమ్స్ చేసే హడావిడి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. నేటి కాలంలో సోషల్ మీడియాలో హైప్ క్రియేట్ చేయడం, పీఆర్ ఏజెన్సీలతో హడావిడి చేయించడం చాలా సులభమైపోయిందని రాశీ అభిప్రాయపడ్డారు. "ప్రచార ఆర్భాటం కేవలం అటెన్షన్ మాత్రమే ఇస్తుంది. కానీ గౌరవాన్ని సంపాదించి పెట్టదు. కీర్తి అనేది తాత్కాలికం కావచ్చు, కానీ ప్రేక్షకుల మనసులో స్థానం సంపాదించాలంటే నిజమైన ప్రతిభ, నిలకడ చాలా ముఖ్యం" అని ఆమె స్పష్టం చేశారు. కేవలం డబ్బుతో కొనుక్కునే ప్రచారం కంటే, కష్టపడి సంపాదించుకునే గౌరవమే శాశ్వతమని ఆమె పేర్కొన్నారు. హీరోయిన్ల పోటీ పెరిగిన ఈ సమయంలో చాలామంది అడ్డదారుల్లో పాపులారిటీ సంపాదించాలని చూస్తుంటారని, కానీ ఒక నటిగా ఇండస్ట్రీలో ఒక వారసత్వాన్ని నిర్మించడం అందరి వల్ల సాధ్యం కాదని రాశీ ఖన్నా అన్నారు. "ఈ రోజుల్లో హడావిడి సృష్టించడం చాలా ఈజీ.. కానీ పదేళ్ల తర్వాత కూడా మిమ్మల్ని గుర్తుంచుకోవాలంటే అది కేవలం మీ పనితీరుతోనే సాధ్యమవుతుంది" అని ఆమె చెప్పారు. రాశీ ఖన్నా ఇండస్ట్రీలోని ఈ చేదు నిజాన్ని ఇంత ధైర్యంగా చెప్పడం చూసి నెటిజన్లు ఆమెకు మద్దతు తెలుపుతున్నారు. నిజం చెప్పావు రాశీ.. టాలెంట్ ఉంటేనే ఎవరైనా ఇండస్ట్రీలో నిలబడతారని అంటున్నారు









# ఆర్టీసీ సమస్యలపై ముఖాముఖి

- ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం సమీక్షా సమావేశం
- కొత్త రూట్లు, బస్సులు, డిపోల ఏర్పాటుపై నియోజకవర్గాల వారీగా విజ్ఞప్తులు
- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- రవాణా శాఖ మంత్రి పొన్నం హెచ్చరిక

## ప్రజాప్రతినిధుల వినతుల వెల్లువ



**రాష్ట్రవ్యాప్తంగా 'మహాలక్ష్మి' పథకం ద్వారా ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజైన శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల ప్రజాప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో కొత్త బస్సుల అవసరం, శిథిలావస్థలో ఉన్న బస్ స్టేషన్ల ఆధునీకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, కొత్త రూట్ల ఏర్పాటుపై ఎమ్మెల్యేలు మంత్రికి వినతి పత్రాలు సమర్పించారు.**




**నిర్మల్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

మహా లక్ష్మీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో నియోజకవర్గాల వారిగా కావాల్సిన మౌలిక సదుపాయాలు, కొత్త బస్సులు, బస్ స్టేషన్‌ల అభివృద్ధి, కొత్త రూట్లు,బస్ డిపోల అవసరాలపై మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో కలిసి ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు అదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో అసెంబ్లీ కమిటీ హాల్ -1 లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.. చెన్నూరు నియోజకవర్గంలో బస్ స్టేషన్ అభివృద్ధితో పాటు కొత్త రూట్ లలో బస్సులు నడిపించాలని మంత్రి వివేక్ వెంకట్ స్వామి సూచించారు. సింగరేణి ఏరియాలో కార్మికులకు ఇబ్బందులు లేకుండా గతంలో నడిచిన రూట్లతో పాటు అదనపు రూట్ లలో నడిపించాలని కోరారు. కోరుట్ల నియోజకవర్గంలో మెట్పల్లి, కోరుట్ల బస్ స్టేషన్‌లను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే డా,, సంజయ్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ కి విజ్ఞప్తి చేశారు. మొగిలిపేట ప్రధాన రహదారి పై బస్సులు ఆగేలా చూడాలని కోరారు. మండలాల వారిగా హైదరాబాద్ కి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఆత్మకూరు కి 8 ట్రిప్పులు నడిచేవని ఇప్పుడు 4 మాత్రమే నడుస్తున్నాయని వాటి సంఖ్య పెంచాలని కోరారు.కోరుట్ల పట్టణంలో ముత్యాలమ్మ ఆలయం వద్ద బస్సులు ఆగాలని కోరారు. దక్షిణ కాశీగా పిలువబడే వేములవాడ కి అన్ని జిల్లాల నుండి కనెక్టివిటీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ కి సిరిసిల్ల,కోరుట్ల, జగిత్యాల, మెట్పల్లి డిపో లోనుండి బస్సులు పెంచాలని సూచించారు. వేములవాడ ,చందుర్తి బస్ స్టేషన్ లను మోడర్న్ స్టేషన్లుగా అభివృద్ధి చేయాలని కోరారు. కథలాపూర్ మండలం రాజారాం తండా, కథలాపూర్ కొండాపూర్ వరకు, గంభీర్ పూర్ వరకు వస్తున్న బస్సులను మోత్కూరు, గోవిందపూర్, వరకు సర్వీసులు పెంచాలని కోరారు. చందుర్తి నుండి మర్రిమడ్ల వరకు బస్సులు నడపాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో వేములవాడ నుండి బాంబేకి ప్రారంభమైన బస్సుల వల్ల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రుద్రంగి, కొనరావుపేట బస్ స్టేషన్లు అభివృద్ధి చేయాలని కోరారు. మేడిపల్లి మండల కేంద్రంలో ఉన్న బస్ స్టేషన్‌లో టాయిలెట్స్ నిర్మించాలని సూచించారు. హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ లో ఇప్పటికే 1.5 కోట్ల రూపాయలతో నిర్మించమని దానికి మరిన్ని నిధులు కేటాయిస్తే ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. అక్కడే ఉన్న ఆర్టీసీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. రాచపల్లి-నాగంపేట రూట్‌లో బస్సులు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి జిల్లాకి చిరకాల స్వప్నం బస్సు డిపో మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే విజయరమణరావు ధన్యవాదాలు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా డిపో పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. పెద్దపల్లి నుండి హైదరాబాద్ ,హనుమకొండకి కొత్త బస్సులు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. తమ నియోజకవర్గంలో కొమురవెల్లి అధికముగా వెళ్తుంటారని ఓదెల నుండి కొమురవెల్లికి ప్రత్యేక బస్సు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థలో ఉన్న సుల్తానాబాద్ బస్ స్టేషన్ ను నిర్మించాలని కోరారు. కరీంనగర్- బస్ డిపో నుండి శ్రీరాంపూర్‌కి బస్సులు వేయాలని కోరారు.రామగుండంలో అప్పట్లో సిటీ బస్సులు ఉండేవని ఇప్పుడు తొలగించడం వల్ల సింగరేణిలో ప్రధాన పట్టణం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో కొత్త రూట్లలో బస్సులు నడిపించాలని సూచించారు. గోదావరిఖని ఆర్టీసీ ఖరీదైన స్థలంలో డిపో నుండి వేలన్నీ నిర్మించి ముందు వైపు షాపింగ్ మాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. రామగుండం, ఎన్టీపీసీ లలో మినీ బస్ స్టేషన్లు నిర్మించాలని కోరారు. 15 కొత్త బస్సులు కావాలని కోరారు. చొప్పదంటి ఆర్టీసీ కాంపౌండ్ వాల్ కొంత రోడ్డుకు ఇస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. కోడిమ్యాల బస్ స్టేషన్ పనులు ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల స్కూల్ సమయంలో అదనంగా బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలో జగిత్యాల నుండి కడెం బస్సులు నడిపించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించారు. ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్‌కి బస్సులు పెంచాలన్నారు. ఉట్నూరు ఆదిలాబాద్ మధ్య బస్సులు నడిపించాలని ఉట్నూరు ఆర్టీసీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. నిజాం కాలంలో నిర్మించిన ఆసిఫాబాద్ పురాతన బస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ విజ్ఞప్తి చేశారు. బస్ స్టేషన్ లో ఫ్లాట్ ఫాం సంఖ్య పెంచాలని కోరారు. 5 పల్లె వెలుగు బస్సులు గ్రామాలకు నడపాలని కోరారు. నియోజకవర్గం నుండి వేములవాడ, కొండగట్టుకి ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. ఆర్టీసీ పెట్రోల్ బంకు ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. బస్ స్టేషన్ లో టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. బోథ్‌లో చాలా రూట్‌లలో బస్సులు బంద్ అయ్యాయని కొత్త రూట్‌లలో బస్సులు నడిపించాలని కోరారు.ఇచ్చోడ బస్ స్టేషన్ 18 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని దానిని అభివృద్ధి చేయాలని కోరారు. సిరికొండ, తలైగూడ, కరంజీ, నిగ్నె, వధురు, కుంతల మీదుగా బస్సులు నడపాలని సూచించారు. 2027 జూన్ లో పుష్కరాలు సమీపిస్తుండటంతో బాసర లో బస్ స్టేషన్ ఆధునీకరించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ విజ్ఞప్తి చేశారు.ఫ్లాట్ ఫామ్ పెంచాలని, టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. ఉబెర్ బస్ స్టేషన్ లో సీసీ వేయాలని కోరారు. భైంసా నుండి పోచ్రాద్ బస్సులు నడపాలన్నారు. సిర్పూర్ కాగజ్ నగర్‌లో బస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని రోడ్లతో సంబంధం లేకుండా మారుమూల ప్రాంతాల్లో బస్సులు నడపాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ విజ్ఞప్తి చేశారు. అశ్వారావుపేటలో కవడిగుండ్ల, గుమ్మడవల్లికి దశాబ్ద కాలం తర్వాత బస్సులు రావడంపట్ల ఎమ్మెల్యే ఆది నారాయణ సంతోషాన్ని వ్యక్తం చేశారు. దమ్మపేట బస్ స్టేషన్ శిథిలా వస్థలో ఉండడంతో దానిని 60 లక్షలు మంజూరయ్యాయనీ త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు. భద్రాచలం వెళ్లడానికి విజయవాడ కొత్తగూడెం నుండి కాకుండా ఆల్టర్నేటివ్ రూట్‌లో బస్సులు నడపాలని సూచించారు. పినపాక నియోజకవర్గంలో గుండారం మండలంలో రాష్ట్రంలోనే అత్యంత మారుమూల ప్రాంతమని అక్కడ మధ్యాహ్నం సమయంలో అదనంగా బస్సులు నడపాలని కోరారు. మణుగూరు సింగరేణి ప్రాంతంలో లక్ష జనాభా ఉందని అక్కడ బస్ డిపో కి అదనంగా బస్సులు కావాలని కోరారు. నియోజకవర్గంలో అదనంగా బస్సులు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇల్లందు నియోజకవర్గంలో అదనంగా బస్సులు నడపాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. వైరా నియోజకవర్గం నాలుగు రాష్ట్రాలకు సరిహద్దుల్లో ఉందని అదనంగా బస్సులు వేయాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కోరారు. మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల వారిగా మంత్రులు ,ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులు స్వీకరించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అన్ని జిల్లాలో నియోజకవర్గాల వారిగా ఆర్టీసీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని బస్ స్టేషన్లలో టాయిలెట్స్ , మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. బస్ స్టేషన్ అభివృద్ధిలో ఆర్టీసీ తో ఎమ్మెల్యేలు తమ ఫండ్స్ ద్వారా సహకరించాలని కోరారు. కొత్త వస్తున్న బస్సులు ఎక్కడెక్కడ అవసరాలు ఉన్నాయి అక్కడకి పంపిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా కొత్త రూటులో బస్సులు పంపించడానికి యాక్షన్ ప్లాన్స్ సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులతో ఆర్టీసీ అధికారులు ప్రజాసంబంధాలు కలిగి ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వహిస్తే ఆ చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో కరీంనగర్ ఆదిలాబాద్, ఖమ్మం ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, సంజయ్ కుమార్, కౌశిక్ రెడ్డి, మేడిపల్లి సత్యం, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, విజయ రమణ రావు, వెడ్మ బొజ్జు, కోవ లక్ష్మీ ,అనిల్ జాదవ్, రామారావు పటేల్, పాల్వాయి హరీష్ బాబు, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్ నాయక్, జారే ఆది నారా యణ, కోరం కనకయ్య, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడిలు, ఆర్ఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.












# శీఘ్ర వృద్ధాప్యం!

## కొవిడ్‌తో వయసు కంటే ముందే రక్తనాళాలకు ముసలితనం

- గుండెపోటు ముప్పుపై పరిశోధకుల హెచ్చరిక
- తేలికపాటి ఇన్ఫెక్షన్ తోనూ గుండె, పక్షవాతం ముప్పు
- పురుషుల కంటే మహిళల ధమనులపైనే తీవ్ర ప్రభావం
- లాంగ్ కొవిడ్ బాధితుల్లో ఈ సమస్య మరింత తీవ్రం
- వ్యాక్సిన్ తీసుకున్నవారిలో రక్తనాళాలు మెరుగ్గా ఉన్నట్టు గుర్తింపు





కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించి ఏళ్లు గడుస్తున్నా.. దాని దీర్ఘకాలిక ప్రభావాలు ఒక్కొక్కటిగా బయటపడుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా జరిపిన ఒక విస్తృత స్థాయి అధ్యయనంలో కొవిడ్ ఇన్ఫెక్షన్, అది తేలికపాటిది అయినా సరే, మన రక్తనాళాలను వయసు కంటే ముందే బలహీనపరిచి, గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యల ముప్పును పెంచుతున్నట్లు వెల్లడైంది. ఈ ప్రభావం పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు.

**రక్తనాళాలపై తీవ్ర ప్రభావం..**


ఫ్రాన్స్‌లోని పారిస్ సిటీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రోసా మరియా బ్రూనో నేతృత్వంలోని పరిశోధక బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. 16 దేశాలకు చెందిన సుమారు 2,390 మందిపై 2020 సెప్టెంబర్ నుంచి 2022 ఫిబ్రవరి మధ్య పరిశోధనలు జరిపారు. 'కొవిడ్ వైరస్ నేరుగా రక్తనాళాలపై ప్రభావం చూపుతుందని మాకు తెలుసు. దీని వల్ల రక్తనాళాలు వయసు కంటే వేగంగా వృద్ధాప్యానికి గురవుతాయి. ఫలితంగా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదం పెరుగుతుంది'అని ప్రొఫెసర్ బ్రూనో వివరించారు. ఈ అధ్యయన ఫలితాలను ప్రతిష్ఠాత్మక యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో ప్రచురించారు.

**వ్యాక్సిన్ తీసుకున్నవారిలో తీవ్రత తక్కువ..**

కొవిడ్ సోకని వారితో పోలిస్తే ఇన్ఫెక్షన్ కు గురైన వారందరిలో.. ముఖ్యంగా మహిళలు, లాంగ్ కొవిడ్ లక్షణాలతో (ఆయాసం, అలసట వంటివి) బాధపడుతున్న వారిలో రక్తనాళాలు లేదా ధమనులు గట్టిపడినట్లు ఈ అధ్యయనంలో స్పష్టంగా తేలింది. అయితే, కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ధమనులు అంతగా గట్టిపడలేదని, వారి పరిస్థితి కాస్త మెరుగ్గా ఉందని కూడా పరిశోధకులు గుర్తించారు.

**ఇన్ఫెక్షన్ తర్వాత రక్తనాళాలకు ఎక్కువ నష్టం..**

మహిళల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉండడానికి వారి రోగనిరోధక వ్యవస్థ పని తీరే కారణం కావచ్చని ప్రొఫెసర్ బ్రూనో అభిప్రాయపడ్డారు. 'మహిళల రోగనిరోధక వ్యవస్థ వేగంగా, బలంగా స్పందిస్తుంది. ఇది ఇన్ఫెక్షన్ నుంచి వారిని కాపాడుతుంది. కానీ, అదే బలమైన స్పందన ఇన్ఫెక్షన్ తర్వాత రక్తనాళాలకు ఎక్కువ నష్టం కలిగించవచ్చు'అని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో, కొవిడ్ బారిన పడిన వారిలో గుండె సంబంధిత ముప్పును ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు



## గ్రామాల్లో నీటి ఎద్దడి

### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**కాగజ్‌నగర్, మార్చి 28 (ప్రభాత సమాచారం)** రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా 95-99% ఇళ్లకు నీళ్లు అందుతున్నాయని చెప్పడం అవాస్తవమని, ప్రాణహిత నది సమీపంలోని మురళీగూడ వంటి గ్రామాల్లో ప్రజలు ఇప్పటికీ ఎడ్ల బండ్లపై వెళ్లి డ్రమ్ముల్లో నీళ్లు తెచ్చుకుంటున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు విమర్శించారు. ఈ తప్పుడు గణాంకాలతో కేంద్ర నిధులు ఆగిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉన్నా, పంచాయతీలకు నిధులు లేవని, బోరు బావులు తవ్వించాలని డిమాండ్ చేశారు.

## మాజీ మంత్రి పరామర్శ

**నిర్మల్,మార్చి28(ప్రభాత సమాచారం)** నిర్మల్ పట్టణంలోని సీనియర్ పాత్రికేయుడు పత్తి శివప్రసాద్ మాతృమూర్తి ఇటీవలే మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని రాష్ట్ర మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం పిల్లల వైద్య నిపుణులు సంతోష్ రాజ్ దంపతులను పరామర్శించి దాడి ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు ఉన్నారు.



### 6లోగా అక్రిడిటేషన్‌కు

## దరఖాస్తు చేసుకోవాలి


**ఆసిఫాబాద్,మార్చి28(ప్రభాత సమాచారం)** అక్రిడిటేషన్ కార్డుల కోసం ఏప్రిల్ 6లోగా జర్నలిస్టులు దరఖాస్తు చేసు కోవాలని డీపీఆర్‌వో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాజమాన్యాల నుంచి పొందిన సిఫార్సు లేఖతోపాటు అవసరమైన ధ్రువపత్రాలు, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఇండిపెండెంట్ జర్నలిస్టులు కటింగులు జతపర్చాలని సూచించారు. నిబంధనల ప్రకారం అర్హులైన వారికి కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

### అంతర్జాతీయ సదస్సులో

## ఖానాపూర్ వాసి

**ఖానాపూర్,మార్చి28(ప్రభాత సమాచారం)** మండలంలోని గోసంపల్లెకు చెందిన ఎదులాపురం సత్యనారాయణచారి.. బీహార్‌లోని నలంద విశ్వవిద్యాలయంలో 26 నుంచి 28 వరకు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు ప్రతినిధిగా హాజరయ్యారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ, యువజన సేవల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రపంచ వేదికపై సాఫ్ట్ పవర్, విధానాలు, యువ దౌత్యం' అనే అంశంపై మూడు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. విదేశీ వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి అలోక్ దిమిరి కార్యక్రమాన్ని ప్రారంభించగా, నలంద వీసీ సచిన్ చతుర్వేది సమక్షంలో సదస్సు జరిగింది. భారత్‌తో పాటు పది దేశాల దౌత్య వేత్తలు, నిపుణులు పాల్గొన్న సదస్సులో సత్యనారాయణ అభిప్రాయాలు పంచుకున్నారు.







# నిర్మల్ జిల్లాకు రెండు 'స్కోచ్' అవార్డుల పంట

*నిర్మల్ జిల్లా పేరు జాతీయ స్థాయిలో మరోసారి మారుమోగింది. జిల్లా యంత్రాంగం అమలు చేసిన వినూత్న పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు గుర్తింపుగా రెండు ప్రతిష్టాత్మక 'స్కోచ్' అవార్డులు వరించాయి. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా శనివారం జరిగిన కార్యక్రమంలో ల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత శాఖల అధికారుల తో కలిసి ఈ పురస్కారాలను అందుకున్నారు. జిల్లాకే ప్రత్యేకమైన కొయ్యబొమ్మల వారసత్వాన్ని కాపాడేందుకు చేపట్టిన 'పొనికి వనం' సాగుతో పాటు, గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి మాతృత్వ మరణాలను తగ్గించిన 'అమ్మరక్షిత' కార్యక్రమం ఈ ఘనతను సాధించిపెట్టాయి.*

- పొనికి వనం, 'అమ్మరక్షిత' కార్యక్రమాలకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు...
- ఢిల్లీలో పురస్కారాలు అందుకున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు...
- జిల్లా ఖ్యాతిని చాటిన కొయ్యబొమ్మల పరిరక్షణ, మాతృత్వ మరణాల నివారణ చర్యలు

నిర్మల్, మార్చి 28 (ప్రభాత సమాచారం)

జాతీయ వేదికపై మరోసారి నిర్మల్ జిల్లా ఖ్యాతి ప్రజరిల్లింది. జిల్లాకు రెండు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులు దక్కాయి. వివిధ జిల్లా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు గాను అవార్డ్లు నిర్మల్ జిల్లా సొంతం చేసుకుంది. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ అవార్డులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత శాఖలతో కలిసి స్వీకరించారు. నిర్మల్ జిల్లాకే తలమాణికమైన కొయ్య బొమ్మల పరిరక్షణ, చారిత్రాత్మక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో.. కొయ్య బొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి కర్రల పెంపకం కోసం ఏర్పాటు చేసిన పొనికి వనానికి గాను లభించిన జాతీయస్థాయి స్కోచ్ అవార్డును జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మితో కలిసి స్వీకరించారు. జిల్లాలో అమ్మరక్షిత అనే వినూత్న కార్యక్రమం ద్వారా మాతృత్వ మరణాలు తగ్గించినందుకు లభించిన మరో స్కోచ్ అవార్డును వైద్యరోగ్య శాఖ అధికారి రాజేందర్‌తో కలిసి కలెక్టర్ స్వీకరించారు. అవార్డు స్వీకరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మరోసారి జిల్లాకు జాతీయ వేదికలో అవార్డు రావడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. అధికారుల ఉత్తమ పనితీరుతో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేసి, అవార్డు సాధనలో కృషి చేసిన అధికారులు అందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్మల్ జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్న కలెక్టర్‌కు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.

# సురక్షిత ప్రయాణమే శ్రేయస్కరం



## రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో డీసీపీ భాస్కర్

**మంచిర్యాల, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

ప్రతీ డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలను నడిపి ప్రమాదాలను నివారిస్తూ ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇళ్లకు వెళ్లాలని డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. నస్పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని సీసీసీలో రూరల్ సీఐ గోపతి రవీందర్ ఆధ్వర్యంలో శనివారం ఆరైవ్ అలైవ్ ఫేజ్-0.3 రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్లు, ఇతర వాహనాల డ్రైవర్లకు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమా దాల నివారణకు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. డ్రైవర్లు దూర ప్రాంతాలకు ప్రయాణించే సమయంలో డ్రైవింగ్‌ను జాగ్రత్తగా చేయాలని సూచించారు. అలసట, నిద్ర సమస్య ఉన్నట్లయితే తప్పనిసరిగా విశ్రాం తి తీసుకోవాలన్నారు. విశ్రాంతి లేకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. వేగ పరిమితులను పాటిస్తూ సీటు బెల్ట్ ధరించాలని, వాహనాలను నడిపిస్తూ ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. మ ద్యం సేవించి వాహనాలను రోడ్డుమీదకు తీసుకరావద్దన్నారు. రోడ్డు ప్రమాదం లో గాయపడిన వ్యక్తులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలను కా పాడిన వారికి ప్రభుత్వం రహవీర్ పథకం ప్రవేశపెట్టి ప్రోత్సహాక బహుమతి అందిస్తుందన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను, నిబంధనల ను పాటిస్తూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరాలన్నారు. అంతకు ముందు డ్రైవర్లకు సురక్ష కంటి వైద్య శాల ఆధ్వర్యంలోడాక్టర్ అభిషేక్ కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే సీసీసీ కార్నర్ వద్ద చలివేంద్రాన్ని డీసీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ గోపతి రవీందర్, సీసీసీ ఎస్ఐ మేకల ప్రశాంత్, నస్పూర్, మంచిర్యాల లారీ అసోసియేషన్ అధ్యక్షులు సదానందం, హుస్సేన్, డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



## స్త్రీనిధిలో నిర్మల్ జిల్లాకు

# రాష్ట్ర స్థాయి రెండో బహుమతి

**మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్న యంత్రాంగం**
**లోకేశ్వరం మండలానికి ప్రత్యేక పురస్కారం**
**మహిళల ఆర్థిక సాధికారతకు నిదర్శనం**
**హైదరాబాద్‌లో జరిగిన స్త్రీనిధి**
**13వ సర్వసభ్య సమావేశంలో ప్రదానం**

**నిర్మల్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్త్రీనిధి కార్యకలాపాల్లో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం దక్కడం గర్వకారణంగా నిలిచింది. అదే విధంగా లోకేశ్వరం మండలం స్త్రీనిధి అమలులో ఉత్తమ ప్రదర్శన కనబరచి ప్రత్యేక అవార్డును సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా హైదరాబాదులో నిర్వహించిన స్త్రీనిధి 13వ సర్వసభ్య సమావేశంలో గౌరవ మంత్రివర్యులు సీతక్క చేతుల మీదుగా జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, ఏపిడి అవార్డులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దివ్యదేవరాజన్, స్త్రీనిధి ఎండి తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. జిల్లాలో స్త్రీనిధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతూ మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

**ఆసిఫాబాద్, మార్చి 28 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి డేవిడ్ అన్నారు. అదనపు కలెక్టర్ చాంబర్‌లో శనివారం పంచాయతీ రాజ్, విద్యాశాఖ, గ్రంథాలయ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గ్రంథాలయాల్లో ఫ్యాన్లు, తాగునీరు, కుర్చీలు, టేబుళ్లు, టాయిలెట్, ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా చల్లని తాగనీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. చరిత్రకు సంబంధించిన గ్రంథాలయ సర్వస్వము ఈ విజ్ఞాన సూచిక, ఎంప్లాయిమెంట్ న్యూస్, కురుక్షేత్ర, యోజన, కస్టమర్ ఆవాజ్, పునాధి వంటి తెలు గు, ఇంగ్లీష్ మ్యాగ్జైన్లు ఉండాలన్నారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరం వార్షిక పద్దును ఆమోదించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సరిత, పంచాయతీ అధికారి భిక్షపతి, లైబ్రెరి యన్‌లు సదానందం, ప్రవీణ, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

